క్లుప్తంగా

కమలనాథుడికి బండి పరామర్శ



మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితరులు

బడంగ్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు మోహన్‌రెడ్డిని.. అల్మాస్‌గూడలోని ఆయన నివాసంలో శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఆయనతో పాటు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్, నాయకులు ఉన్నారు.

అందరికీ పోషకాహారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోషక నిపుణులు

కందుకూరు: అందరికీ పోషకాహారం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పోషకాహార సంస్థ హైదరాబాద్ నిపుణులు డాక్టర్ చెన్నకేశవులు బృందం ఆధ్వర్యంలో నేదునూరు మోడల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహార మార్గదర్శకాలు, స్థూల, సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషక వివరాలను గుర్తించే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. పోషికాహార లోపంతో వచ్చే శారీరక సమస్యలను డిజిటల్ స్క్రీన్ ద్వారా తెలిపారు. పోషక విలువలపై చిన్నారులను ప్రశ్నలు అడిగారు. సమాధానం చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీను, సిద్దార్థ, రాహుల్, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, పుష్పలత, పరమేశ్వర్, కొండలరావు, వెంకటరమణ, కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి చేయూతనిస్తాం

ఎమ్మెల్యే తనయుడు కౌశిక్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కౌశిక్‌రెడ్డి, నాయకులు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి చేయూతనిస్తామని ఎమ్మెల్యే సబితారెడ్డి తనయుడు కౌశిక్‌రెడ్డి హామీనిచ్చారు. అనాథ, మానసిక దివ్యాంగుల కోసం సొంత గూడు నిర్మాణానికి సహకరించాలని ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే స్పందించారు. శుక్రవారం తన కుమారుడిని ఆశ్రమానికి పంపించారు. ఆయన అక్కడ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆశ్రమాన్ని సందర్శించి మాట్లాడారు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి.. ఆశ్రమాన్ని సందర్శించి ఒక నెల వేతనాన్ని అందజేస్తారని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని మిగతా ఎమ్మెల్యేలు కూడా అభాగ్యుల ఆశ్రమానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కుప్పలు.. వాహనదారుల తిప్పలు



ఔటర్ రింగురోడ్డులో మట్టి కుప్పలు

తుక్కుగూడ: ఇసుక కుప్పలు.. వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో నీటితో కొట్టుకు వచ్చిన మట్టి.. నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుపై పేరుకుపోయి కుప్పలుగా మారింది. ఇది ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి, గాయాల పాలవుతున్నారు. ఔటర్ జంక్షన్ మట్టితో నిండిపోయిందని, సంబంధిత అధికారులు స్పందించి మట్టి కుప్పలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.19, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.20, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.23.

ఇలా వేశారు.. అలా పోయింది



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇటీవల మరమ్మతు చేసిన రోడ్డు దుస్థితి



గుంతలు పడిన మంత్రాల చెరువుకు వెళ్లే రహదారి

- మరమ్మతులు చేసి పట్టుమని పదిరోజులైనా కాలేదు
- యథాస్థితికి చేరుకున్న రహదారులు
- ప్రజాధనం వృథాపై స్థానికుల ఆగ్రహం

మీర్‌పేట: పట్టుమని పది రోజులైనా కాలేదు. అలా ప్యాచ్‌లు వేశారో లేదో.. అప్పుడే కంకర తేలి గుంతల మయం అయిన రహదారులు మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా దెబ్బతిన్న రహదారులకు అధికారులు వారం రోజుల క్రితమే మరమ్మతులు చేయించారు. సీసీ, బీటీ రోడ్లకు మరమ్మతుల కోసం రూ.20 లక్షల నిధులను కేటాయించారు. గణేశ్ నిమజ్జనం ఉండడంతో ఆర్భాటంగా రహదారులకు మరమ్మతులు చేపట్టడం, అది కూడా పైపైనే పనులు కానిచ్చేయడంతో పలుచోట్ల మళ్లీ కంకర తేలి గుంతలు దర్శనమిస్తున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది మరమ్మతులైనా సక్రమంగా చేయకపోవడంతో అటు సమస్య పరిష్కారం కాకపోగా, ఇటు ప్రజాధనం కూడా వృథా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుటే

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుటే ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేపట్టినప్పటికీ వారం గడువక ముందే రోడ్డు యథాస్థితికి చేరుకోవడంతో యంత్రాంగం పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం ముందున్న రహదారితో పాటు లలితానగర్ కూడలిలోనూ మరమ్మతు చేసిన రహదారి ధ్వంసమైందని, మరమ్మతుల పేరిట ప్రజాధనం వృథా చేయకుండా, నాణ్యతతో పనులు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పోరాట యోధుడు సీతారాం



మీర్‌పేట: ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

- ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి
- ఏచూరి వర్ధంతిలో సీపీఐ, సీపీఎం శ్రేణులు

మీర్‌పేట: పోరాట యోధుడు సీతారాం ఏచూరి. అట్టడుగు వర్గాల కోసం నిరంతరం ఉద్యమించిన మహనీయుడు అని సీపీఎం జిల్లా నాయకుడు గోరెంకల నర్సింహ అన్నారు. పార్టీ బాలాపూర్ మండల కమిటీ సభ్యుడు దాసరి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం కూడలిలో ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బి.ప్రకాశ్‌రెడ్డిలతో కలిసి సీతారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మతోన్మాదాన్ని రూపుమాపడమే ఏచూరికి నిజమైన నివాళి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యాదగిరిచారి, కిషన్, రాజు, వెంకయ్య, ధనంజయ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో.. నేతల నివాళి

కందుకూరులో..

కందుకూరు: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతిని ఆ పార్టీ మండల కార్యదర్శి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా సెక్రటరీ సభ్యుడు రాంచందర్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఏచూరీ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సీపీఎం నాయకులు శ్రీనివాస్, నరసింహ, కాళిదాస్, జి.నరసింహ, ఆశ వర్కర్లు సరస్వతి, ముంతాజ్ బేగం, శ్రీలత, అనిత, అండాలు, సంధ్య, చంద్రకళ, సీఐటీయూ నాయకుడు శేఖర్ పాల్గొన్నారు.

సులభతరంగా బోధించాలి

ఎంఈఓ కస్నా నాయక్



టీఎల్ఎంను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుక్కుగూడ: ఉపాధ్యాయులు.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎంఈఓ కస్నా నాయక్ సూచించారు. శుక్రవారం పురపాలిక కేంద్రంలో మండల స్థాయి ప్రాథమిక తరగతుల టీఎల్ఎం (బోధన, అభ్యసన సామగ్రి) స్టాల్స్‌ను నిర్వహించారు. ఇందులో మహేశ్వరం మండలంలోని 27 ప్రాథమిక, 13 ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బోధన సామగ్రిని వినియోగించి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

15న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

లింగోజిగూడ: రంగారెడ్డి జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్టు ఎంపిక ఈ నెల 15వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఎంపికకు వచ్చే వారు ఆధార్ కార్డు లేదా 10వ తరగతి మెమో తీసుకు రావాలని సూచించారు.బాలబాలికల బరువు 55 కేజీలు మించకుండా ఉండాలని రంగారెడ్డి జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 25 నుంచి 29 నిజామాబాద్ జిల్లా ముప్కల్‌లో జరిగే 35వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీలలో రంగారెడ్డి జిల్లా తరఫున ఆడుతారన్నారు. మరిన్ని వివరాలకు 7661992581, 9000222489 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ నాగమణిని సన్మానిస్తున్న గణేశ్ ఉత్సవ సమితి

మీర్‌పేట: చవితి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు శుక్రవారం కమిషనర్ నాగమణిని శాలువాతో సన్మానించారు. అనంతరం సమితి అధ్యక్షుడు చిల్లంపల్లి రాజశేఖర్ మాట్లాడుతూ.. నిమజ్జనం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిషనర్ తగిన చర్యలు చేపట్టారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కోకన్వీనర్ సోమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు భిక్షపతి చారి, గోపినాథ్, కాశీరాం యాదవ్, కోశాధికారి ఎడ్ల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

గ్రూప్–1 పరీక్ష మళ్లీ నిర్వహించాలి

చేవెళ్లలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన

చేవెళ్ల: హైకోర్టు తీర్పు మేరకు గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని బీఆర్‌ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ వైఫల్యం కారణంగా గ్రూప్–1 అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. తెలుగు మీడియం విద్యార్థులకు పేపర్ మూల్యాంకనంలో అన్యాయం జరిగిందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, తప్పు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు సతీష్, రాఘవేందర్, రవికుమార్, పృథ్వీరాజ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

విద్యాబోధన ఆదర్శంగా ఉండాలి

ఎంఈఓ బసునాయక్



అవార్డుతో తావురినానాయక్



శివప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ బసునాయక్

హుడాకాంప్లెక్స్: పాఠ్య పుస్తకాల్లోని సిలబస్ పూర్తి చేయడమే పరమావధిగా పని చేస్తున్న నేటికాలంలో కొందరు ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని సరూర్‌నగర్ మండల విద్యాధికారి బసునాయక్ అన్నారు. మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 33 మంది టీచర్లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. కొందరు పాఠశాలల్లో సౌకర్యాల కల్పన కోసం స్వయం కృషి చేయగా.. ఇంకొందరు నిరుద్యోగులకు అండగా ఉంటూ బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథం నింపేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్న తావురియానాయక్, శివప్రసాద్‌లు మాట్లాడుతూ.. సన్మానంతో మరింత ఉత్సాహంగా పని చేస్తామన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి బాసటగా నిలుస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్గాటి యాదయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం సమితి ఆధ్వర్యంలో సీపీఐ నాయకులతో కలిసి సీనియర్ అసిస్టెంట్ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు సమానమైన, న్యాయమైన హక్కులు కల్పించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులకు ప్రతి గ్రామంలో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ బంధు బిల్లును ఆమోదించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కేంద్రం, రాష్ట్రంలో నామినేట్ పోస్టులలో కూడా వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద బీసీలకు, ఇతర వర్గాలకు రూ.10లక్షల అందించాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పిల్లలకు న్యాయమైన ఉచిత విద్య అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామస్వామి, ప్రభులింగం, సత్తిరెడ్డి, సుధాకర్‌గౌడ్, మంజుల, వెంకటయ్య, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి ఘట్టుపల్లి గ్రామంలో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధుల విడుదల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలపై ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త త్వరలో జరిగే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాకేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాండు నాయక్, నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కొమురయ్య, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్య పరిష్కారానికి మరో కాలువ

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బంజారా కాలనీలో వరద కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: బంజారా కాలనీ వరద సమస్యను పరిష్కరించేందుకు గతంలో వరద కాలువను నిర్మించామని, శ్మశాన వాటిక వైపు నుంచి వచ్చే వరదను తప్పించేందుకు మరో డ్రైన్ లైన్ నిర్మిస్తామని త్వరలోనే పనులు మొదలు పెడతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షాలకు సమీపంలోని శ్మశాన వాటిక ప్రాంతంలో వరద నీరు చేరినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బంజారా కాలనీలో పర్యటించారు. శ్మశాన వాటిక ప్రాంతంలో చేరిన వరద నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని శ్మశాన వాటిక ప్రహరీని ఒక చోట కూల్చి వేసి తాత్కాలికంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా నిర్మించే డ్రైన్ లైన్ పూర్తయితే బస్‌డిపో, కోర్టు, పద్మావతి కాలనీలకు వరద ముంపు సమస్య తీరుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట శ్రీధర్‌గౌడ్, బాస్కర్ సాగర్, మధు ముదిరాజ్, హేము నాయక్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

- ఇంజాపూర్ వైపు నుంచి మునుగనూరు శివారు మీదుగా బంజారా కాలనీ వైపు వస్తున్న వరద కాలువను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హైడ్రా సిబ్బందితో కలిసి పరిశీలించారు. తక్షణ చర్యగా శ్మశాన వాటిక వద్ద వరద నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని హైడ్రా సిబ్బందిని కోరారు.

ప్రజల ఇబ్బందులను తొలగించాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



చెత్త, చెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: వర్షం కారణంగా ఇబ్బందులు పడుతున్న లోతట్టు ప్రాంతాల కాలనీలవాసుల సమస్యలు పరిష్కరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. డివిజన్ పరిధి ఆగమయ్యనగర్‌కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించి మాట్లాడారు. ఆగమయ్యనగర్ కాలనీలోని వర్షపు నీటితో పాటు, మట్టి, ఇసుక కొట్టుకు రావటంతో కాలనీ బురదమయంగా మారిందన్నారు. కేఎల్ఎం పక్కనుంచి జరుగుతున్న భూగర్భ వరదకాలువ నీరు పెద్ద చెరువులోకి చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువులో మురుగు చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షం నీరు నిలిస్తే సమాచారం ఇవ్వండి..

ఎల్‌బీనగర్: వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలనీల్లో వర్షపు నీరు ఎప్పటికప్పుడు ముందుకు పారేలా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు కాలనీలలో నిలిచిన నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం అందుకున్న ఆయన శుక్రవారం అధికారులలో కలిసి కాలనీల్లో పర్యటించారు. వరద నీటికి అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలలో ఎక్కడ వర్షం నీరు ఆగిన తనకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. మరింత భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో ప్రజలు అత్యవసరం ఉంటేనే బయటకు వెళ్లాలనాన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిరివెన్నేల, భవ్యరెడ్డి, కార్తీక్, నాయకులు రాజుగౌడ్, నరేష్‌యాదవ్, వెంకటేశ్, సుధాకర్, రాము, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి



సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఎల్‌బీనగర్: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని తెలంగాణ మున్సిపల్ కార్మిక, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం కోరారు. కార్మికులకు జీతాలు పెంచాలని శుక్రవారం ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం ముందు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏసురత్నం మాట్లాడుతూ.. పెరగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.30 వేల చేయాలన్నారు. వచ్చే నెల 2వ తేదీన దసరా ఉన్నందున కార్మికులకు ఈ నెల 26 లోపు జీతాలు చెల్లించాలన్నారు. వేతనాలు పెంచకపోతే ధర్నాలు, రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, హరినాథ్‌రావు, మద్దిలేటి, లక్ష్మీ, అండాలు, దయాకర్, శ్రీరాములు, హరిబాబు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



ఎన్టీఆర్‌నగర్‌లో సీతారాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగోలు: ప్రజా ఉద్యమాలకే తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి సీపీఎం పార్టీ నేత సీతారాం ఏచూరి అని ఆ పార్టీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి వెంకన్న అన్నారు. న్యూ నాగోలు డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటీయూ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ లతీఫ్ అధ్యక్షత సీపీఎం నేత, వామపక్ష యోధుడు సీతారాం ఏచూరి వర్ధంతిని శుక్రవారం సీపీఎం న్యూనాగోలు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సీతారం ఏచూరి సోషలిస్టు సమాజ సాధనకు కృషి చేసే వారని నేటి యువత ఏచూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్య, వీరయ్య, చంద్రయ్య, శంకర్, శ్రీను, వెంకటయ్య, పార్వతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: లౌకిక విలువల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు దివంగత నేత సీపీఎం పార్టీ నాయకులు సీతారాం ఏచూరి అని ఆ పార్టీ ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శి గోపీనాయక్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో చేరి చురుకుగా ఉద్యమాల పోరాటాలు చేసిన నాయకుడు అన్నారు. భారతదేశంలో ఇండియా కూటమి ఏర్పడడానికి సీతారాం ఏచూరి ముఖ్య పాత్ర పోషించారన్నారు. కళావతి, పాల్గొన్నారు.